క్లుప్తంగా

నేడు స్పాట్ అడ్మిషన్లు

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేసే 3 నెలల ఉచిత శిక్షణ కోసం గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారిని సునీత కుమారి, స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో గల ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో ఉంటుందన్నారు. జిల్లాలో డిగ్రీ పాసైన ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు డిగ్రీ మెమో వెంట తీసుకురావాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాహుల్, ఇఫ్తార్‌లు బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓసియస్ కంప్యూటర్ సహకారంతో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 75695 36323 సంప్రదించాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాలు

ఇచ్చోడ: మండలంలోని జామిడిలో బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్య సిబ్బంది శేఖర్, దేవురావులు మాట్లాడుతూ.. పశుపోషకులు ప్రతిఒక్కరూ తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయాలని కోరారు.

మోటార్ల చోరీ ప్రాంతం పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్సై ముజాహిద్

సాక్షి ఎఫెక్ట్..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని భీంసరి వ్యవసాయ పొలాల సమీపంలోని వాగుల నుంచి 'ఆగని మోటర్ల చోరీలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎస్సై ముజాహిద్ స్పందించి చోరీకి గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. అనుమానిత వ్యక్తులను విచారించి దొంగలను త్వరలో పట్టుకుంటామని, రైతులు ఆందోళన చెందావాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రాజ్యసభ సభ్యుడిని కలిసిన ఎంపీటీసీ

తాంసి: మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ కొడాల సంతోష్ రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్‌ను కలిశారు. బుధవారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

'కాంగ్రెస్‌తోనే బహుజనులకు న్యాయం'



మాట్లాడుతున్న రాజేశ్వర్

ఇచ్చోడ: కాంగ్రెస్‌తోనే దళిత, బహుజనులకు న్యాయం జరుగుతుందని మాల సంఘం అధ్యక్షుడు శాంతపురం రాజేశ్వర్ అన్నారు. బుధవారం ఇచ్చోడలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగా బీజేపీకి మద్దతు ఇచ్చి కాంగ్రెస్ పార్టీని సీట్లు అడగడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కలిసి మెలిసి ఉన్న మాదిగా, మాలాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతుందని ఆరోపించారు. దళిత బహుజనులంత కాంగ్రెస్‌తో కలిసి నడవాలన్నారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బొజ్జ రాజేందర్, ఇదుల్ల రాకేశ్, బత్తుల అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

నేరడిగొండ: మండలంలోని వడూర్ శ్రీ సీతారామ చంద్రస్వామి రామాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు ఎల్కొచి శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. యజ్ఞ హోమం కార్యక్రమాలతో పాటు పూజలు చేశారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు.

తాగునీటికి కటకట

- సక్రమంగా రాని భగీరథ నీరు
- పైపుల లీకేజీలతో వృథా
- పట్టించుకోని అధికారులు



చేతిపంపు వద్ద నీటి కోసం బారులు తీరిన ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: రోజు రోజుకూ ఎండలు దాంచి కొడుతున్నాయి. దీంతో బోరుబావి, బావి, చేతి పంపులలోని భూగర్భ జలాలు అడుగంటాయి. వేసవి ప్రారంభంలోనే ఆదిలాబాద్ రూరల్ మండలంలోని గిరిజన గ్రామాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. వేకువ జామున 4 గంటలకే చేతి పంపుల వద్ద బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలతో మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఉన్న వాటి ద్వారా ఎప్పుడు.. ఎన్ని రోజులకు నీటి సరఫరా అవుతాయో తెలియని పరిస్థితి. కొన్ని గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీలతో నీరు వృథా అవుతోంది.

సేవాదాస్‌నగర్‌లో తాగునీటి తిప్పలు

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిచ్ధరి పరిధిలోని సేవాదాస్‌నగర్ గ్రామం గత 45 ఏళ్ల కిందట ఏర్పడింది. ఇక్కడ 20 ఇళ్లు ఉండగా.. సుమారు 100 వరకు జనాభా ఉంది. వీరి దాహార్తిని తీర్చేందుకు గ్రామంలో ఒక చేతిపంపు మాత్రమే ఉంది. ప్రస్తుతం వేసవి కావడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. అరగంట వేచి ఉంటే 4 నుంచి 5 బిందెలు మాత్రమే నీళ్లు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేకువ జామున 4 గంటల నుంచి లైన్‌లో ఉండాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి నీటిఎద్దటి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగైదు రోజులకు మిషన్ భగీరథ నీరు

సేవాదాస్‌నగర్‌కు మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, నాలుగైదు రోజులకు ఒకసారి మాత్రమే నీరు సరఫరా అవుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పైప్‌లైన్ లీకేజీలు కారణంగా నీరు కలుషితం అవుతోంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తిప్పలు పడుతున్నాం



గత కొన్ని రోజుల నుంచి తాగు నీటి కోసం చాలా తిప్పలు అవుతోంది. దీని కోసం తమ గ్రామంలోని చేతి పంపు వద్ద తెల్లవారు జామున 4 గంటల నుంచే బోరింగ్ కాడా ఉంటున్నాం. అయినప్పటికీ సరిపడేంత నీరు రావడం లేదు.

– జాదవ్ వీణాబాయి, సేవాదాస్‌నగర్, ఆదిలాబాద్ రూరల్

సక్రమంగా రాని భగీరథ నీరు



వేసవి ప్రారంభంలోనే తాగే నీళ్లకు పరేషన్ అవుతోంది. మిషన్ భగీరథ నీళ్ల నాలుగైదు రోజులకు ఒకసారి వస్తున్నాయి. లీకేజీలతో నీరంతా వృథా అవుతోంది. ఇప్పుడే ఇట్లా ఉంటే మును ముందు తాగే నీళ్ల కోసం మా పరిస్థితి ఎంటిది.

– ఆడే వనిత, సేవాదాస్‌నగర్, ఆదిలాబాద్ రూరల్

ధరణి పట్టాలు వెంటనే ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న కొలాం ఆదివాసీలు

బేల: కొలాం ఆదివాసీ రైతులకు పాత పట్టాలకు నూతన ధరణి పట్టాలు వెంటనే ఇవ్వాలని మండల కొలాం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మడావి జంగు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సదల్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఉమ్మడి ఆంధ ప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 25 మంది కొలాం ఆదివాసీ రైతులకు వ్యవసాయ సాగు కోసం 120 ఎకరాల భూమికి పట్టాలు ఇచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ భూముల తాలుకు నూతన ధరణి పట్టాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని ఆరోపించారు. రైతుబంధు, రైతుభీమా, బ్యాంకు రుణాలు లబ్ధిదారులకు అందడమం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మడావి మారుతి, టేకాం రాజు, ఆత్రం భీంరావు, కొడప రామరావు, తదితరులు పాల్గొన్నారు.

'టెట్' ఫీజు తగ్గించాలి

నేరడిగొండ: టెట్ అర్హత ఫీజును తగ్గించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోష్ సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తక్కువ ఫీజుతో పోటీ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వంపై కాంగ్రెస్ దుమ్మెత్తి పోసిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఒక పేపర్‌కు రూ.200, రెండు పేపర్లు రాసేవారికి రూ.300 ఫీజు ఉండేదని, ప్రస్తుతం ఒక పేపర్ రాసేవారు రూ.1000, రెండు పేపర్లు రాసేవాళ్లు రూ.2000 చెల్లించాల్సిందేనని తేల్చి చెప్పిందన్నారు. లేనియెడల రేవంత్ రెడ్డి సర్కారుపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ జెండా ప్రతిష్ఠతను కాపాడాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ జెండాను గౌరవించడం ప్రతిఒక్కరి బాధ్యతనని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజ్జగిరి నారాయణ అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇంటింటా ఎగరేసిన జాతీయ జెండాలు చినిగిపోతున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని బుధవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప.. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాలను ఎగురవేయడం స్వాగతించదగ్గ విషయమేన్నారు. జెండాలను తొలగించకపోవడంతో చినిగిపోతున్నాయన్నారు. ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం సమీపంలోని భారీ జాతీయ జెండాను సైతం ప్రస్తుతం తొలగించారని, వెంటనే కొత్తది ఏర్పాటు చేయాలనీ కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు సంతోష్, నేరటి ఉదయ్ కిరణ్, రాము, కుమ్ర రాజు, మర్సుకోల బాపూరావు, రాజు ఉన్నారు.

'ఉపాధి' పనుల్లో వేగం పెంచాలి



పనులు పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయన్న



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్ రెడ్డి

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో వేగం పెంచి పనుల్లో పురోగతి సాధించాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. బుధవారం మండలంలోని బోరిగామ పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కూలీ వంద రోజులు పనిచేసే విధంగా స్థానిక సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ పనులు చేసే విధంగా చూడాలన్నారు. పనిచేస్తున్న వారికి రోజుకు కూలీ ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. వచ్చె నెల నుంచి పనుల్లో మరింత వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, టెక్నికల్ అసిస్టెంట్ సునీత, క్షేత్ర సహాయకుడు సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

తాంసి: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని తాంసి ఎంపీడీవో మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కప్పర్ల, పాలోది, జామిడి గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యకు తగినట్లుగా హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం సమయంలో కూలీలు పనికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఆయన వెంట టీఏ రాజన్న, పంచాయతీ కార్యదర్శుల సంధ్యారాణి, అనిత, నరేశ్, తదితరులు ఉన్నారు.

మోదుగ పూల అందం



అడవుల జిల్లా ఆదిలాబాద్‌లో ప్రకృతి అందాలకు కొదువ లేదు. శిశిరంలో ఆకులు రాల్చి.. వసంత నాటికి చిగురించి ఆకట్టుకుంటాయి. అప్పుడే విరగబూసిన పూలతో మోదుగ పువ్వులు ప్రకృతి ప్రేమికుల మదిని దోచేస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం దేవాపూర్ మీదుగా భరంపూర్ వెళ్లే మార్గంలో చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

- ఎదులాపురం

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



కవాతు చేస్తున్న పోలీసులు

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రణదీవేనగర్, బంగారుగూడ సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో ఓటర్లలో ఉన్న అభద్రత భావాన్ని తొలగించేందుకు కవాతు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సూరజ్, ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్, ఏఎస్సై జాహీర్, సిబ్బంది దేవిదాస్, రామకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌లో గురువారం ఆదివాసీ బిర్డ్‌గోండ్(తోటి) యువజన సంఘం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తోటి సంఘం నాయకులు తెలిపారు. మెగా రక్తదాన శిబిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరామర్శ



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కంది శ్రీనివాసరెడ్డి

జైనథ్: కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి జైనథ్, బేల మండలాల్లో బుధవారం పర్యటించారు. ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బేల మండలంలోని దహెగాం గ్రామానికి చెందిన నాక్లే అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అక్కడి నుంచి మణియార్‌పూర్ గ్రామానికి వెళ్లి బెదోడ్కర్ బాయిజాబాయి ఇటీవల చనిపోవడంతో ఆమె కుటుంబీలకులను పరామర్శించారు. జైనథ్ మండలం బాలాపూర్‌లో మాజీ సర్పంచ్ రావుత్ దామోదర్ సతీమణి రావుత్ లీలాబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం పలువురి బాధితులను పరామర్శించారు. మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బేక్కం వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అక్కడికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అలాగే ఇచ్చోడ మండలం అడేగాం గ్రామానికి చెందిన కైలాష్ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అక్కడికి చేరుకొని ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

ఎండుతున్న పల్లెప్రకృతి వనాలు

- పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైనం
- రూ. లక్షల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు



ఈఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోత గూడ గ్రామ పల్లెప్రకృతి వనం. ఇక్కడ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చుకోవడమే కష్టం. అలాంటిది పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను ఎక్కడి నుంచి నీళ్లు అందిస్తారు. ఈవిషయం పాలకులకు కూడా తెలుసు అయినప్పటికీ అధికారుల ఒత్తిడితో పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేశారు.

ఆదిలాబాద్‌రూరల్: పల్లె ప్రజలకు ఆహ్లాదకర వా తావరణం అందించాలని గ్రామాల్లో ప పల్లె ప్రకృతి వనాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటు కోసం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ ప థకం నుంచి నిధులు కేటాయించారు. దీంతో వనా ల ఏర్పాటు కోసం స్థలాలను పరిశీలించాలని, అందులో వివిధ రకాల మొక్కలను పెంచాలని ఆదేశాలు జారీ చేసింది. అందుకోసం ప్రభుత్వ స్థలాలు అ న్వేషించాలని ఉన్నతాధికారులు సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ప్ర భుత్వం, ఉన్నతాధికారుల ఒత్తిడితో పలు ప్రయత్నాలు చేసి స్థలాలు కనిపెట్టారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కలు పెరిగేందుకు అనుకూలమైన స్థలం లేకున్న పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఏదో తూతూ మంత్రంగా మొక్కలు నాటి, పల్లె ప్రకృతి వనం బోర్డు ఏర్పాటు చేశా రు. ప్రస్తుతం అలాంటి ప్రకృతి వనాల్లో నాటిన మొ క్కలు కనిపించకుండా పోయాయి. అక్కడ పిచ్చి మొక్కలు, పెద్ద పెద్ద బండరాళ్లు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

నిర్వహణ గాలికి..

2018– 19 సంవత్సరంలో ప్రతీ గ్రామంలో ఏర్పా టు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల పాటు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు అప్పగించారు. వారి రెండేళ్ల కాల పరిమితి ముగిసినంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు అప్పగించారు. వారి పదవీ కాలం ముగిసేంత వరకు కొంత మంది సర్పంచ్‌లు ప్రత్యేక చొరవతో పల్లె ప్రకృతి వనా లను కాపాడారు. చాలా గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ ప్రస్తుతం గాలికి వదిలేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

ప్రజాధనం వృథా..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క పల్లె ప్రకృతి వనానికి సుమారు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు ఖర్చు చేయగా విస్తీర్ణం ఎక్కువ ఉన్న ప్రకృతి వనానికి రూ. 50వేలు కూడా ఖర్చు చేశారు. మండలంలో అన్నింటికీ కలిపి సుమారు రూ. 18 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుతం వాటి నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండి పోయి పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజాధనం వృధా అయిందని ప్రజలు పేర్కొంటున్నారు.

గ్రామ పంచాయతీలే చూసుకోవాలి



పల్లెప్రకృతి వనం ఏర్పాటు అనంతరం నిర్వహణ బాధ్యతలను రెండేళ్ల పాటు తమ శాఖ ఉద్యోగులకు ఇచ్చారు. కాల పరిమితి అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సంబంధిత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. చాలా చోట్ల పల్లెప్రకృతి వనాల్లో ప్రస్తుతం పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి.

– జాకీర్ హుస్సేన్, ఎన్ఆర్ఈజీఎస్, ఏపీవో, ఆదిలాబాద్ రూరల్

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

బజార్‌హత్నూర్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశం కోసం మండలంలోని అన్ని విభాగాల అధికారులు ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకుని వచ్చిన ఎంపీపీ, ఎంపీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.

అనుమతులు లేని ఇటుక బట్టీలను తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ తుకారాం

ఇచ్చోడ: అనుమతులు లేని ఇటుక బట్టీలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ తుకారాం అన్నారు. బుధవారం మండలంలోని సిరిచెల్మ లో ఇటుక బట్టీలను పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లో ఇటు క బట్టీలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. నాలుగు రోజుల్లో తొలగించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ రామారావు, ఆర్ఐ హుస్సేన్, తదితరులు ఉన్నారు.